**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


ప్రచురణార్థం/ ప్రసారార్థం : విజయవాడ,

తేది : 20 మార్చి, 2023.

## అంగన్‌వాడీల అరెస్టులు అన్యాయం

కనీస వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటి తీవ్రంగా ఖండిస్తున్నది. ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేయడానికి ఈ రోజు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి విజయవాడకు చేరుకున్న అంగన్‌వాడీలను రైల్వేస్టేషన్‌లు, ఇతర చోట్ల ఎక్కడికక్కడ అటకాయించి 1500 మందిని అరెస్టులు చేయడం, విజయవాడకు రాకుండా జిల్లాల్లో బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్ల వద్ద అటకాయించి అరెస్టులు చేయడం అన్యాయం. మహిళలన్న విచక్షణ లేకుండా పోలీసులు రోడ్లపై పడవేసి ఈడ్చుకెళ్ళారు. అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి వారిపై దౌర్జన్యంగా వ్యవహరించడం గర్హనీయం. అరెస్టు అయిన వారిలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి. హెచ్.నర్సింగరావు, నాయకులు సి. హెచ్.బాబూరావు, రాష్ట్ర కార్యదర్శులు కె.ఉమామహేశ్వరరావు, కె.ధనలక్ష్మి ఉన్నారు. అక్రమ అరెస్టులకు నిరసనగా కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో అంగన్‌వాడీలు చేస్తున్న దీక్షలకు సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటి మద్దతు తెలియజేస్తున్నది. మద్దతుగా సిపిఐ(ఎం), సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, ఇతర వామపక్ష పార్టీల నాయకులు దీక్షకు కూర్చున్నారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ యూనియన్‌తో చర్చించి పరిష్కరించాలని, అరెస్టు చేసినవారిని బేషరతుగా విడుదల చేయాలని, సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది.

## పౌరహక్కుల ఐక్య వేదిక, వామపక్ష పార్టీల నాయకుల అరెస్టులకు ఖండన

కూడళ్ళలో ర్యాలీలు, సభలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జివో నం.1ని రద్దు చేయాలని పౌరసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ రోజు చేయతలపెట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని అడ్డుకుని నాయకులను అరెస్టులు చేయడాన్ని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటి ఖండిస్తున్నది. ఏ జివోకు వ్యతిరేకంగా పోరాడుతున్నారో అదే జివో నం.1ను ఉపయోగించి నిర్బంధానికి పూనుకోవడం ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు నిదర్శనం. మేధావులు, లాయర్లు, డాక్టర్లు, ప్రతిపక్ష పార్టీలు, ప్రజాతంత్ర వాదులు ఈ జివోను వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి ఏమాత్రం స్పందన లేదు. దీనికి నిరసనగా జివో నం.1ని రద్దు చేయాలని పౌరసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ప్రశాంతంగా నిర్వహిస్తున్న ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకుని అక్రమంగా అరెస్టులు చేయడం అప్రజాస్వామికం. అరెస్టయిన వారిలో సిపిఐ(ఎం), సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వి.వెంకటేశ్వర్లు, సిపిఐ కార్యదర్శివర్గ సభ్యులు ఎ.వనజ, ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ఈశ్వరయ్య, దోనేపూడి శంకర్, సిపిఐ(యం.యల్) నగర అధ్యక్షులు రామకృష్ణ, ఇతర వామపక్ష, విద్యార్థి, యువజన సంఘ నాయకులను అరెస్టు చేయడాన్ని సిపిఐ(ఎం) ఖండిస్తున్నది. ఐక్యవేదిక నాయకులను గృహ నిర్బంధం చేయడం గర్హనీయం. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి ఇప్పటికైనా జివో నం.1ని రద్దు చేయాలని, అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నది.

జివో నం.1కు వ్యతిరేకంగా, అంగన్‌వాడీ సమస్యలపై ఆందోళనలో అరెస్టయిన నాయకులు, కార్యకర్తల పరామర్శకు వెళ్ళిన సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు కా॥ పి.మధును అరెస్టు చేయడాన్ని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటి ఖండిస్తున్నది.

J. Jayaram

**(జె.జయరాం)**
ఆఫీసు కార్యదర్శి